కథానిక

# ఆకాశరామన్న

"హితశ్రీ"

గోడ గడియారం పదకొండో గంట కొట్టేసరికి జగన్నాథరావు ఉలిక్కిపడి లేచి నుంచున్నాడు కుర్చీలోంచి.

'మాటల సందడిలో టైం తెలియలేదు. నే నొచ్చి అప్పుడే రెండు గంటలు దాటింది. ఇక వెళతాను.'

'ఇవాళ సెలవేగా, కాసేపు కూచుందురూ. అప్పుడే వెళ్ళేం చేస్తారు?' అంది స్వర్ణ. అయినా జగన్నాథరావు వెళ్ళటానికే నిశ్చయించుకుని అడుగు ముందుకు వెయ్యగానే ఎదురుగా ప్రసాద్ వొచ్చాడు.

'అదుగో ప్రసాద్ గారు కూడా వొచ్చారు. కాసేపు కులాసాగా కబుర్లు చెప్పుకుందాం. కూచోండి.'

కాసేపు తటపటాయించినా చివరికి కూచోటానికే నిశ్చయించుకున్నాడు జగన్నాథరావు. అప్పుడే లోపలికి ప్రవేశించిన ప్రసాద్, జగన్నాథరావు మళ్ళీ కూచోటం చూసి ముఖం ముడుచుకున్నాడు.

'పోనీ అంత పనుంటే వెళ్ళనివ్వండి.'

'పెద్ద పనేమీ లేదులే' చిరునవ్వుతో అన్నాడు జగన్నాథరావు. ప్రసాద్ నిప్పులాతో లోలోపలే మండిపడ్డాడు. స్వర్ణకీ, తనకీ ఈ జగన్నాథరావోడ్డంకి. స్వర్ణ తన భర్తని ఈ ఇద్దర్లోనే నిర్ణయించుకుంటుందని వినికిడి. స్వర్ణని తనకి కాకుండా చేసి జగన్నాథరావు తనకి అన్యాయం చేస్తాడేమోనని ప్రసాద్‌కి లోలోపల బెరుకు. ఈ జగన్నాథరావే లేక పోతే...

ఇద్దరూ మొదటినించీ మంచి స్నేహితులే అయినా స్వర్ణ విషయంలో భయం, అనుమానం ప్రసాద్‌కి జగన్నాథరావు పట్ల అసూయా ద్వేషాల్ని రేకెత్తించాయి.

బాతాఖానీ ప్రారంభమయింది. సంభాషణ సాగుతున్నంతసేపూ ప్రసాద్ జగన్నాథరావు ముఖలక్షణాల్ని పరీక్షిస్తూనే ఉన్నాడు. అతను ఎంతసేపటికీ అక్కణ్ణించి కదలకపోవటం ప్రసాద్‌కి మహా కంటగింపుగా ఉంది.

వాకిలికి ఎదురుగా కూచునివున్న జగన్నాథరావు మాట్లాడుతూ, మాట్లాడుతూ స్వర్ణవైపు చూసి, 'మీకేదో ఉత్తరం వొచ్చినట్టుంది. పోస్టుమన్ వొచ్చాడు' అన్నాడు. ఇంతలో పోస్టుమన్ స్వర్ణకి ఓ కవరు ఇచ్చాడు.

'నాకు కూడా ఏమైనా ఉత్తరాలున్నాయేమో చూడవోయ్' అన్నాడు ప్రసాద్.

పోస్టుమన్ వెనక్కితిరిగి ప్రసాద్‌వైపు చూసి, 'మీరు కూడా ఇక్కడే ఉన్నారా సార్, ఇదుగోనండి మీ ఉత్తరం' అని ఓ కవరు ప్రసాద్‌కిచ్చి వెళ్ళిపోయాడు.

కవరు చింపి చదివాడు ప్రసాద్. క్షణంలో అతని కళ్ళు ఎర్రబడ్డాయి. పెదవులు వొణికాయి. అమాంతంగా కుర్చీలోంచి లేచి చేతిలోని ఉత్తరం బల్లమీద విసురుగా కొట్టి, 'సహించలేని వెధవలు' అని అరిచాడు.

స్వర్ణ ఆశ్చర్యంతో, చదివే ఉత్తరం మీద నించి దృష్టి మరల్చి ప్రసాద్‌వైపు చూసింది. జగన్నాథరావు వింతగా అతనివైపు చూశాడు, 'ఏమిటి సంగతి?' అన్నట్టు.

'తిని కూచోలేక ఈ దౌర్భాగ్యపు పను లేమిటంట?' స్వర్ణ ప్రశ్నార్థకంగా అతనివైపు చూసింది.

'బుద్ధిలేని గాడిదలు, ప్రసాద్ అంటే వాళ్ళ చేతిలో కీలుబొమ్మ అనుకున్నారు గావును.'

'ఏం జరిగిందేమిటి?' స్వర్ణ అడిగింది.

ప్రసాద్ ఆమె ప్రశ్న వినిపించుకోకుండా తన ధోరణిలో అరుస్తున్నాడు.

'హుఁ, అంత హృదయదౌర్బల్యమే ఉంటే ఏనాడో ఎందుకూ పనికిరాకుండా పోయే

వాణ్ణి. వీళ్ళ ఉపదేశాలు వినటాని కిక్కడ సిద్ధంగా కూచున్నాననుకున్నారు గావును. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో నాకా మాత్రం తెలియకపోలేదు. అంత చవటనని వాళ్ళ ఉద్దేశ్యం గావును.'

'సంగతేమిటో చెప్పవేం!' అన్నాడు జగన్నాథరావు. జగన్నాథరావు ప్రశ్నని వినిపించుకోలేదు ప్రసాద్.

'నా అచంచల విశ్వాసాన్ని ఇలాంటివాళ్లు వందమంది కలిసినా మార్చలేరు. నా స్నేహితులెవరో, నా శుభచింతకులెవరో నాకు తెలుసు. ఊరూ, పేరూ లేని ఈ వెధవెవడో నా హితైషిట! హుం.'

'ఆకాశరామన్న ఉత్తరమూ ఏమిటి?' అన్నాడు జగన్నాథరావు.

'ఆకాశ రామన్నో, పాతాళ రామన్నో ఎవడైతేనేం!' స్వర్ణ ఆకాశంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది.

ప్రసాద్ తన ఉత్తరాన్ని స్వర్ణ దగ్గిరికి తోసి అన్నాడు,

'చూడండి, వాడి పాడు రాత.'

స్వర్ణ ఉత్తరం చదివింది.

'శ్రీ ప్రసాద్ గారికి,

స్వర్ణ గత చరిత్ర మీ రెరుగరు. ఆమెతో స్నేహం మీబోటి మర్యాదస్తులకు తగదు. కారణాంతరాలచే ప్రస్తుతము నన్ను మీకు తెలుపుకోలేను. దరిమిలా మీకు అన్ని విషయాలూ స్వయంగా తెలుపగలను. మీ హితైషుల ప్రోద్బలంవల్ల ఇలా రాస్తున్నాను.

ఇట్లు,
మీ శుభ చింతకుడు.'

స్వర్ణ ఉత్తరం చదివి ప్రసాద్ వైపు చూసింది.

'ఇటువంటి ఉత్తరాలు నమ్మేటంత మూర్ఖుణ్ణనుకోకండి. సమయానికి జేబులో నిప్పుపెట్టె లేదుగానీ ఈ పాటికి దీన్ని మసిచేసి నీళ్ళలో కలిపి తాగి ఉందును.' ఆ ఉత్తరం తను ఎక్కడ నమ్ముతున్నాడని ఆమె అనుకుంటుందోనని ముందే సందేహ నివృత్తి చేయటానికి ప్రయత్నించాడు ప్రసాద్.

'దీంట్లో రాసింది అబద్ధమని మీకెలా తెలుసు?'

'శుద్ధ అబద్ధం. నాకు తెలుసు'

'ఎలా తెలుసు? అతను నిజమే రాసి ఉండొచ్చు.'

'ఎప్పటికీ కాదు. మీవిషయం నాకు పూర్తిగా తెలుసు. ఎవడో గిట్టనివాడు చేసిన పని యిది. నేను ఇటువంటి ఉత్తరాలని నమ్మేటంత నీచుణ్ణి కాదు. నా హృదయం మీకు తెలీదు. తెలిస్తే మీరలా అనరు.'

'ఒకవేళ దీంట్లో రాసింది నిజమే ననుకోండి. అప్పుడు మీకు నా స్నేహం ఇష్టం ఉండదనుకుంటాను.'

'ఎంతమాట!'

'ఇష్టమేనా?'

'తప్పక'

'అయితే మీకు నామీదగల అభిమానం చేత ఈ ఉత్తరాన్ని నిరసిస్తున్నారన్న మాట.'

'అవును' అన్నాడు గర్వంగా ప్రసాద్.

'ఆకాశరామన్న ఉత్తరాలమీద మీకు ప్రత్యేకంగా ఏహ్యభావం లేకపోయినా, నన్ను ఉద్దేశించటంచేత మీకు హృదయానికి బాధ కలిగింది. అంతేనా?' అంది స్వర్ణ అతని కళ్ళలోకి చూస్తూ.

'అసలు ఆకాశ రామన్న ఉత్తరాల్ని నేను పాటించను' అన్నాడు ప్రసాద్ కొంచెం సంకోచిస్తూ. చూస్తే, స్వర్ణ తనని చిక్కులోకి లాగుతుందేమో ననిపిస్తోంది అతనికి.

'అయితే నామీదగల నమ్మకంవల్ల కాదన్న మాట మీరు ఆ ఉత్తరాన్ని విసర్జించింది.'

'అబ్బే మీమీద నమ్మకం ఉండబట్టే నేను ఆ ఉత్తరాన్ని అలా దుయ్యబట్టాను. అసలు, అలాంటి ఉత్తరాలమీద నాకు గౌరవం లేదనుకోండి. అందులో మీలాంటి వాళ్ళమీద అలా రాసినప్పుడు దాన్ని తృణప్రాయంగా చూస్తాను' అని సర్దాడు ప్రసాద్. కాని అతని సమర్థన అతనికే తృప్తిగా లేదు. స్వర్ణ తనని ఎక్కడైనా బోల్తాకొట్టించిందేమోనని మథనపడసాగాడతను.

స్వర్ణ తనకి వొచ్చిన ఉత్తరం ప్రసాద్‌కి అందించింది. ప్రసాద్ అది చదివి స్వర్ణ ముఖం వైపు జాలిగా చూస్తూ అన్నాడు:

'నమ్ముతారా?'

'మిమ్మల్ని గురించి, అంటే మీ వ్యక్తిగత జీవితాన్ని గురించి నాకేమీ తెలీదు.'

'ఇది మీమీద ద్వేషంతో ఎవరో రాశారు. ఇది నమ్మటం దురన్యాయం.'

'ఎవరు రాశారని మీ అభిప్రాయం?'

'నాకెలా తెలుస్తుంది? మనిద్దరి స్నేహం చూసి గిట్టని వాళ్లు ఎవరో రాశారని స్పష్టపడుతూనే ఉందిగా.'

'అవును. నామీద ద్వేషం వున్న వాళ్లు మీకు రాసినట్టుగానే నా ఇతర ముఖ్య స్నేహితులకి కూడా రాసే ఉంటారనుకుంటాను. మీకు అంత గిట్టని స్నేహితులెవరో!'

'ఎందరో మహానుభావులు!' అన్నాడు వెటకారంగా ప్రసాద్, క్రీగంట జగన్నాథరావుని చూస్తూ.

'ముఖ్యంగా జగన్నాథరావుగారికి ఇటువంటి ఆకాశ రామన్న ఉత్తరం రాకపోవటం ఆశ్చర్యంగా ఉంది.' స్వర్ణ జగన్నాథరావు వైపు తిరిగిఅంది. జగన్నాథరావు దిక్కులుచూశాడు. ఓ నిమిషం ఆగి అతను మెల్లగా అన్నాడు:

'నాకూ వొచ్చింది.'

'ఆఁ' ఆశ్చర్యంగా అతనివైపు చూసింది స్వర్ణ.

'మరి ఇందాకటినించీ చెప్పరేం?'

'చెప్పేందు కేముందిందులో?'

'ఇందాకటినించీ దీని విషయం ఇంత చర్చ జరుగుతూంటే ఏమీవిశేషం లేనట్లుగా మాట్లాడ తారేమిటి? మీకు వొచ్చిన ఉత్తరంలో ఏం రాసుంది?'

'ఏమో!'

'జ్ఞాపకం లేదా?'

'ఆ ఉత్తరం నేనసలు చదవలేదు పూర్తిగా.'

'ఏం?'

'మొదటి కొన్నిమాటలు చదివేసరికి కింద సంతకం చూడాలనిపించింది. 'శుభ చింతకుడు' అని కింద రాసివుంది. వెంటనే మడిచి జేబులో పెట్టాను, ఇంటి కెళ్ళింతరవాత పొయ్యిలో పడెయ్యటానికి. కాని పోస్టాఫీసునించి సరాసరి ఇక్కడికే రావటంవల్ల ఇంకా ఆపని సాధ్యం కాలేదు.' స్వర్ణ ఆశ్చర్యంగా జగన్నాథరావు వైపు చూసింది.

'ఏదీ ఆ ఉత్తరం ఇలా ఇయ్యండి చూద్దాం.'

జగన్నాథరావు జేబునించి ఓ ఉత్తరం తీసి స్వర్ణ చేతికిచ్చాడు. ఆమె దాన్ని ప్రసాద్‌కి వొచ్చిన ఉత్తరంలో పోల్చి చూసింది.

'రెండూ ఒకే మాదిరిగా ఉన్నాయి చూడండి.' రెండు ఉత్తరాలూ స్వర్ణ జగన్నాథరావు వైపు పడేసింది. అవి తీసుకోకుండా అతను, 'అనవసరం' అన్నాడు.

'ఏం?'

'ఈ ఉత్తరాల్ని గురించి ఇప్పటికే చాలా టైం పాడుచేశారు. ఇంకా వీటికోసం టైం పాడుచేయటం శుద్ధ అనవసరం.'

స్వర్ణ అతనివైపు అసక్తితో చూసింది.

'మాటవరసకయినా మీ కిలాంటి ఉత్తరం వొచ్చిందని చెప్పలేదేం? రెండు గంటలసేపు మాట్లాడాంగదా!'

'ఆకాశ రామన్న ఉత్తరాల్ని గురించి నేను మాట్లాడను. నిజంగా నామీద అంత దయా, అపేక్ష, అసక్తి ఉన్న మనిషయితే నాతో స్వయంగా వొచ్చి ఎలాగో మాట్లాడతాడు. తెరవెనక దాక్కుని ఇలాంటి నీచమైన పనిచేసే వారికి పనుల్ని సరకు చెయ్యడం వాళ్ళకి దోహదం కలగచెయ్యటమే. ప్రసాద్ గొడవ చేసే దాకా నేనసలు ఉత్తరం సంగతే మర్చిపోయాను.'

'నేనేం గొడవచేశాను?' అన్నాడు ప్రసాద్ కోపంగా.

'ఇందాకటినించీ, నీ హృదయం విశాలమైంది అని నిరూపించుకోటానికి ఎదటివాళ్ళ హృదయానికి ఎంత బాధ కలిగించావో నువ్వు గ్రహించలేక పోయావు.'

'ఎవరికి, ఏంబాధ కలిగించాను?' ముఖం చిట్లించుకుని అన్నాడు ప్రసాద్.

'ఆమెనిగురించి దుష్ప్రచారం జరుగుతోంది అని ఆమెకి తెలియచెయ్యటం హృదయానికి అనవసరమైన బాధ కలిగించటం కాదా?'

ప్రసాద్ నిరుత్తరుడైయ్యాడు.

స్వర్ణ జగన్నాథరావువైపు కళ్లు పెద్దవి చేసి చూసింది.

'మీరు ఉత్తరాన్ని నిర్లక్ష్యం చేసింది అలాంటి ఉత్తరాలమీద మీకుగల జుగుప్స వల్ల ననుకుంటాను.'

'అవును' అన్నాడు అతను ఆమెవైపుచూస్తూ.

'నామీద మీకుగల నమ్మకంవల్ల కాదా?'

'మీ మీద నాకున్న నమ్మకానికీ, ఆకాశ రామన్న ఉత్తరాలకీ ఏమీ సంబంధం లేదు. ఉండటానికి ఏమాత్రం వీల్లేదు. మనద్దరి నమ్మకం వ్యక్తిగతం. మధ్య ఈ ఆకాశరామన్న గాడెవడు!' అని నావైపు కాంతివంతమైన కళ్ళతో చూసింది స్వర్ణ. ఆ చూపును చూసిన ప్రసాద్ స్వర్ణమీద ఆశ అప్పుడే వొదులుకున్నాడు. అతనిలో ఈర్ష్య తాటిప్రమాణంగా లేచింది.

'ఇదంతా చూస్తే అసలీ ఉత్తరాల్ని సృష్టించింది నువ్వేనల్లే ఉంది.'

ఈ నేరారోపణకి స్వర్ణ, జగన్నాధరావు ప్రసాద్‌వైపు వింతగా చూశారు.

'కోపంతో అంటున్నావా?'

'ఆధారం ఉంది. స్వర్ణకి వొచ్చిన ఆకాశ రామన్న ఉత్తరం నన్ను గురించే. నీ ప్రసక్తి అసలు దాంట్లో లేదు. నాకు స్వర్ణని గురించి అలా రాసి, ఆమెనించి నన్ను వేరుచేసి నువ్వామెను వివాహం చేసుకోవాలని వేసిన ఎత్తు.'

ఒక్కక్షణం జగన్నాధరావు ఆలోచించాడు.

'ఉత్తరాలు రాసిందెవరో నాకు తెలిసింది. కాని పేరు చెప్పను. చెప్పటంవల్ల ప్రయోజనం లేదు' జగన్నాధరావిలా అని స్వర్ణవైపూ, ప్రసాద్‌వైపూ చూశాడు.

'ఉత్తరాలు ఎవరు వ్రాసిరా, వాటినిగురించి చర్చించడం, ఎవరు వ్రాశారో అని ఆరా తియ్యటము పనిదండగా, టైంవేస్టూ. ఇకా దీన్ని ఇంతటితో ఆపేద్దాం' అంది స్వర్ణ.

మర్నాడు పార్కులో కలిసి, 'నువ్వు నన్ను అభినందించాలి' అన్నాడు జగన్నాధరావు ప్రసాద్‌తో. ఆనాటితో ప్రసాద్ స్వర్ణ మీది ఆశ పూర్తిగా వొదులుకున్నాడు. తరవాత జగన్నాధరావుతో అతను ఎప్పటిలా స్నేహంగా మెలుగుతున్నాడు. అతని పెళ్ళికి ఓ పుస్తకం బహూకరించాడు కూడా. దాని మీద ఇలా రాసిఉంది.

'ప్రియమిత్రులు జగన్నాధరావుకీ, స్వర్ణకీ-మీ ఇద్దరికీ పెళ్ళి చేసిన "ఆకాశరామన్న."'

# వెలుగు నీడలు

అవసరాల రామకృష్ణరావు

చలికాలం. చలి గజగజ వణికించేస్తోంది...

అతడు ముసిలి ముద్ద... వీధిలో ముష్టికివెళ్లి తిరిగి యింటికి రాలేక దారిలో కుప్పగా కూలి పోయాడు ... అతణ్ణి ఎవరు యింటికి తీసుకు వెడతారు? ... ప్రక్కనే పూజారి రంగయ్య ఎవరితోనో మాట్లాడుతున్నాడు, "ఏమండోయ్! యీ యేడు అమ్మవారికి గజవాహనం చేయిద్దామనుకుంటున్నాం... ఏదో... తమకు తోచింది" ఆ రెండో మనిషి పదిరూపాయలు కాబోలు యిచ్చాడు.

భక్తుడి కళ్లు తృప్తితో చెమ్మగిల్లేయి!

ముసిలివాడి కళ్లువిచారంతో మూతపడ్డాయి!

*  *  *

"ఎందుకండీ నా కోసం యివన్నీను?" అన్నాడు నాయకుడు.

"అయ్యో! అదేంమాట, రాకరాక వచ్చారు మా కార్యాలయానికి!" అని పంచరంగుల కేకులు నాయకుని ముందు పెట్టేరు సన్మాన సంఘంవారు.

"ఇవాళ కూడా గంజిలేదా?" అని అడిగేడు సోములు.

"ఎక్కడిదీ? నువ్వు తెస్తేకదా నేకాచేది?" అంది రామి.

"చూస్తూ చూస్తూ ఛావగలం కనకనా? ఆకులు తినమన్నారుగా ఆహారశాఖా మంత్రులు పట్రా నములుదాం!"

నాయకుడు కేకులు కొరుకుతున్నాడు!

రామి ఆకులు కొరుకుతోంది!

*  *  *

"ఎంతేమిటి కుట్టుకూలి?"